ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 05-01-2026 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిర మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేయబోతున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శాసనసభలో చెప్పారు.

2. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలందించడానికి చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

3. త్వరలో వరంగల్ విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.

4. నమ్మిన సిద్ధాంతం కోసం , జాతీయ జెండా కోసం ఏబివిపి కార్యకర్తల నిబద్ధతను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొనియాడారు.

**అసెంబ్లీ – మహిళా శక్తి క్యాంటీన్లు**

రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శాసనసభలో ఈరోజు బాలునాయక్ , కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 250 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు విజయవంతంగా కొనసాగుతున్నాయని, అవసరం ఉన్న ప్రతి చోట వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మహిళా సాధికారత , సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. ప్రతి మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలుగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. కిశోర బాలికలు , వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

శంకర్

**అసెంబ్లీ – ఆసుపత్రులు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. కూనమనేని సాంబశివరావు , లక్ష్మారెడ్డి, పాల్వాయి హరిబాబు, నారాయణ రెడ్డి, మీర్ జుల్ఫీకర్ అలీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. నిమ్స్లో అదనంగా 125 వెంటిలేటర్స్ ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1 ,670 వెంటిలేటర్స్ ఉన్నాయని, మరో 485 వెంటిలేటర్లను ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. బెడ్స్, డ్రగ్స్, వెంటిలేటర్స్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. సామాన్యులకు మెరుగైన వైద్యం అందించేందుకు గాను ఆసుపత్రులను విస్తరిస్తున్నామన్నారు.

..శంకర్

**శాసనమండలి – పొంగులేటి**

సమ్మక్క, సారలమ్మ జాతర నేపథ్యంలో సుమారు 200 కోట్ల రూపాయిలకు పైగా నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టామని , ఇప్పటికీ దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... కనీసం 200 సంవత్సరాలకు పైగా నిలిచేలా రాతి కట్టడాలతో ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. మేడారం చుట్టుపక్కల సుమారు 10 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం చేపట్టామని , ఇప్పటికే ఆధునీకరణ పనుల

కోసం 29 ఎకరాల భూమిని అధికారికంగా సేకరించామని తెలిపారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు మరో 63 ఎకరాల భూ సేకరణకు నిర్ణయించామని వెల్లడించారు.

...శంకర్

**అసెంబ్లీ – బీజేపీ**

రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో నెలకొన్న సంక్షోభంపై చర్చించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభ్యులు ఈ ఉదయం అసెంబ్లీ కార్యదర్శికి వాయిదా తీర్మానం ఇచ్చారు. ఈ సందర్భంగా శాసనసభలో బీజేపీ పక్షం నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు పీజీ యూనివర్సిటీల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో యాజమాన్యాలు కాలేజీలను నడపలేక పోతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

శంకర్

**రేవంత్**

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించేందుకు ప్రతిపాదించిన పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నిన్న ముంబయి వెళ్లారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలంటూ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఈరోజు విచారణకు రానున్న నేపథ్యంలో సమర్థంగా వాదనలు వినిపించాలని న్యాయవాది సింఘ్వీకి ముఖ్యమంత్రి సూచించారు.

డెస్క్

**గవర్నర్**

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విశాఖపట్నంలో తూర్పు నౌకాదళం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన అధునాతన భారత నావికా నౌక హిమగిరిని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భారత నావికాదళంలో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాలను విస్తృతంగా ఉపయోగించడం గురించి అధికారులు గవర్నర్ కు వివరించారు. ఇది భారతదేశ పరిణతి చెందిన నైపుణ్యాన్ని ప్రతిబింబించే ఒక మైలురాయి అని చెప్పారు. నిరంతర సముద్ర నిఘాను కొనసాగించడంలో తూర్పు నావికాదళం , తూర్పు నౌకాదళం పోషిస్తున్న కీలక పాత్రను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు.

జీఎస్

**ఫోన్ ట్యాపింగ్ – సుప్రీం కోర్టు**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాధాకిషన్‌రావు , హరీశ్‌రావులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తు చేసింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావు పిటిషన్లలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది.

..శంకర్

**V B G RAM G – S/BYTE**

విబీ జీ రామ్ జీ పథకంలో పని దినాలు పెంచడంతో పాటు వ్యవసాయ సీజన్ లో 60 రోజుల పాటు పనులకు విరామం ఇవ్వడం తమకు ఉపయోగగకరంగా ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా, మల్యాల గ్రామానికి చెందిన లోకోజు సతీష్ కుమార్ చెప్పారు. ఆకాశవాణి ప్రతినిధి రాచర్ల లక్ష్మి నారాయణతో అయన మాట్లాడుతూ...

సౌండ్ బైట్ ... లోకోజు సతీష్ కుమార్, రాజన్న సిరిసిల్ల

పిటిసి, సిరిసిల్ల

**రామ్మోహన్ నాయుడు**

త్వరలో వరంగల్ విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ లోని భోగాపురం విమానాశ్రయంలో తొలి విమాన పరీక్ష విజయవంతమైందని , ఇవన్నీ యువతకు మెరుగైన కనెక్టివిటీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. నిన్న రాత్రి ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తెలుగు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గొప్ప విజయాలు సాధిస్తోందన్నారు.

డెస్క్

**బండి సంజయ్**

అఖిల భారత విద్యార్థి పరిషత్ 44వ రాష్ట్ర మహా సభలు హైదరాబాద్ శివారులోని శంషాబాద్ లో జరుగుతున్నాయి. ఈరోజు కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరై మాట్లాడుతూ... విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంతో పాటు పలువురు ఏబివిపి నాయకులు ప్రాణాలు సైతం కోల్పోయారని గుర్తు చేసుకున్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, జాతీయ జెండా కోసం ప్రాణ త్యాగాలు చేసేందుకు కూడా ఏబివిపి కార్యకర్తలు వెనుకాడబోరని అనేక సందర్భాల్లో రుజువైందని చెప్పారు.

బైట్ ... బండి సంజయ్

జీఎస్

**ఐఎఫ్ఎస్**

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్ష ఫలితాల ఆధారంగా చేసిన క్యాడర్ కేటాయింపుల్లో ఆరుగురు ఐఎఫ్ఎస్‌లను కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించింది. రాష్ట్రానికి చెందిన చాడ నిఖిల్ రెడ్డి, అట్ల తరుణ్ తేజ్ , కర్ణాటకకు చెందిన సుమంత్ జనాద్రి , పశ్చిమ బెంగాల్‌కు చెందిన మయూర్ దేశ్‌ముఖ్, ఢిల్లీకి చెందిన శుభం వత్స , గోవాకు చెందిన వీర్ రిషికేశ్ నాగనాథ్‌లు తెలంగాణ క్యాడర్‌కు కేటాయించిన వారిలో ఉన్నారు.

డెస్క్

**ఎల్ ఐ సి స్టాల్**

హైదరాబాద్ లో జరుగుతున్న నుమాయిష్ ఎగ్జిబిషన్ లో లైఫ్ ఇన్సురెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) స్టాల్ ను ఆ సంస్థ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ ఈరోజు ప్రారంభించారు. ఎల్ఐసి వినియోగదారులు ఈ స్టాల్ ద్వారా అసరమైన సేవలను ఉపయోగించుకోవచ్చని ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ చెప్పారు. బీమా శక్తి పథకం కింద మహిళలు ఎల్ఐసి ఏజెంట్లుగా చేరడానికి ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. అలాగే ఎల్ఐసి అందిస్తున్న ఆన్ లైన్ సర్వీసుల గురించి ఆయన వివరించారు. పాలసీలను మధ్యలో ఆపేసిన వాళ్లకు ఈనెల 1వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రత్యేక పునరుద్ధరణ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు, దీనిని పాలసీదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జీఎస్

**బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన**

ఆసిఫాబాద్ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ తెలిపారు. ఆపరేషన్ స్మైల్ 12 లో భాగంగా నిర్వహించిన తనిఖీల అనంతరం ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ....

వాయిస్ బైట్ ... జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్

పిటిసి, ఆసిఫాబాద్

**జాతీయ పక్షుల దినోత్సవం**

ఈరోజు జాతీయ పక్షుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఇది పక్షుల సంరక్షణ , వాటి ఆవాసాల పరిరక్షణపై అవగాహన కల్పించే రోజు. ప్రకృతి ప్రేమికులు , పక్షి పరిశీలకులు పక్షుల ప్రాముఖ్యతను తెలుసుకుని వాటి రక్షణకు కృషి చేస్తారు. అంతరించిపోతున్న పక్షి జాతులను కాపాడటం, వాటి ఆవాసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, పక్షులు పర్యావరణానికి ఎంత ముఖ్యమో వివరించడం, వాటి రక్షణకు కృషి చేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యంగా ఉంది.

జీఎస్

**జోగుళాంబ గద్వాల్**

గుళాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల బీసీ హాస్టల్ లో షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్ , వేధింపులు, బహిరంగ ప్రదేశాలలో ఎదురయ్యే ప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేధింపులకు గురయ్యే సందర్భంలో షీ టీమ్ హెల్ప్ లైన్ నంబర్ 8712670312 లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

పిటిసి, గద్వాల